సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 6 । జనవరి । 2023



టన్ను చీనీ రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28 వేల ధర పలికాయి. మార్కెట్‌కు 12 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.7

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.7, కనిష్టంగా రూ.2.50 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.3°/12.8°

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. ఫలితంగా చలి తీవ్రత అధికమైంది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వేగంగా భూసేకరణ

- కలెక్టర్ బసంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: జాతీయ రహదారుల పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశామని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 746.24 హెక్టార్లకు గానూ ఇప్పటికే 725 హెక్టార్ల భూమి సేకరించామన్నారు. మిగిలిన భూమిని జనవరి 15లోపు సేకరిస్తామన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్‌అండ్‌బీ ప్రాజెక్టులకు సంబంధించి కూడా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.

పథకాలు సక్రమంగా అమలు చేయండి..

ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. 'గడపగడప'లో గుర్తించి మంజూరు చేసిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సీపీఓ విజయకుమార్, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

2.62 లక్షల పింఛన్ల పంపిణీ



బొంతలపల్లిలో దివ్యాంగునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో భాగంగా గురువారం నాటికి 2.62 లక్షల పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. 32 మండలాల పరిధిలో 2,66,614 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.73,94,43,250 మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 2,62,178 మందికి రూ.72,71,19,500 అందించామన్నారు. ఈ నెల పింఛన్ వారోత్సవాలను పురస్కరించుకుని 7 రోజుల పాటు నగదు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడికి దివ్యాంగ పింఛన్



దివ్యాంగ పింఛన్ అందుకున్న టీడీపీ నాయకుడు దైవాధీనం

పుట్టపర్తి/టౌన్: ఎవరి పట్ల ఎలాంటి పక్షపాతం చూపకుండా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అందిస్తోంది. అందుకు నిదర్శనమే ఈ సంఘటన. మండల పరిధిలో చంద్రాయునిపల్లికి చెందిన దైవాధీనం టీడీపీ నాయకుడు. కొన్ని రోజుల క్రితం ఈయన దివ్యాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలించిన అధికారులు అన్ని వివరాలు సరిగా ఉండడంతో పింఛన్ మంజూరు చేశారు. గురువారం ఆయన రూ.3,000 పింఛన్ అందుకున్నాడు. దైవాధీనం మాట్లాడుతూ తన భార్య నాగమణికి సైతం వృద్ధాప్య పింఛన్ కింద ఇప్పటికే రూ.2,750 వస్తోందని తెలిపారు. ఈ నెలలో తాను రూ.3,000 దివ్యాంగ పింఛన్ తీసుకున్నానని చెప్పాడు. ఇద్దరికీ కలిపి నెలకు రూ.5,750 వస్తోందని సంతోషం వ్యక్తం చేశాడు.

జగన్‌కే మా ఓటు..

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థికే తమ కుటుంబమంతా ఓటు వేస్తుందని, పార్టీలకతీతంగా అందరికీ అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్ రుణం తీర్చుకుంటామని పుట్టపర్తిలోని 20వ వార్డు కమ్మవారిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త నాగేంద్ర తెలిపాడు. ఆయనకు కూడా కొత్తగా దివ్యాంగ పింఛన్ మంజూరైంది. గురువారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి చేతులమీదుగా పింఛన్ మొత్తాన్ని అందుకున్న అనంతరం నాగేంద్ర మాట్లాడాడు. తనకు 5 సంవత్సరాల క్రితం రెండుసార్లు కాళ్లకు ఆపరేషన్ జరిగిందన్నారు. సదరం సర్టిఫికెట్ మంజూరు కాగానే ఇటీవల సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా, తెలుగుదేశం కార్యకర్త అని తెలిసి కూడా మంజూరు చేశారన్నారు. 'ఏ నాయకుడి వద్దకు వెళ్లలేదు. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేద'ని స్పష్టం చేశారు. సీఎం జగన్‌కు తమ కుటుంబమంతా రుణపడి ఉంటుందని చెప్పాడు.

ఇదేం ఖర్మ బాబూ

ఎన్నికల్లో ఓటమి తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు ముఖ్యమైన నాయకులు సైతం కనిపించకుండా పోయారు. కరోనా విపత్కర పరిస్థితులు మొదలు ప్రజలకు సంబంధించి ఏ కష్టంలోనూ వారు పాలుపంచుకోలేదు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఇప్పుడిప్పుడే వారికి జనంపై ప్రేమ ఉప్పొంగిపోతోంది. పార్టీ అధిష్టానం కూడా 'ఇదేం ఖర్మ' నిర్వహించాలని చెప్పడంతో ప్రజల ముందు ప్రత్యక్ష మవుతున్నారు. కానీ, ఆ కార్యక్రమమే ఇప్పుడు టీడీపీలో కుమ్ములాటలకు ఆజ్యం పోస్తోంది. ఏ నాయకుడికి మద్దతు ఇవ్వాలో తెలీక 'మాకిదేం ఖర్మ బాబూ' అని ఆ పార్టీ కార్యకర్తలే పెదవి విరుస్తున్నారు.



- ఒక్కో నియోజకవర్గంలో రెండు, మూడు గ్రూపులు
- అగ్నికి ఆజ్యం పోస్తున్న 'ఇదేం ఖర్మ'
- రోడ్లపైనే టీడీపీ నాయకుల బాహాబాహీ
- సందిగ్ధంలో ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు



వెంకటాపురంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులను అడ్డుకుంటున్న బండారు శ్రావణి వర్గీయులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీకి గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. అంతర్గత కుమ్ములాటలతో ఆ పార్టీ నాయకులు రోడ్లెక్కడంతో ఆ పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలకు దిక్కుతోచడం లేదు. ఏ నియోజకవర్గంలో చూసినా నాలుగైదు వర్గాలు కామన్ అయిపోయాయి. తాజాగా ఆ పార్టీ అధిష్టానం పిలుపిచ్చిన 'ఇదేంఖర్మ' కార్యక్రమం అగ్నికి ఆజ్యం పోసినట్టైంది. దీంతో ఆ పార్టీ కేడర్‌లో నిస్తేజం నెలకొంది.

తారస్థాయికి విభేదాలు

- శింగనమల నియోజకవర్గంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. నియోజకవర్గంలో ఆలం నరసనాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి... బండారు శ్రావణికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. నరసనాయుడు, ముంటిమడుగు వర్గాలు కార్యక్రమం చేయడానికి రావడంతో శ్రావణి వర్గం వారిని అడ్డుకుంది. ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లింది. రోడ్డుమీదనే తెలుగుతమ్ముళ్లు కొట్టుకోవడంతో ఆ పార్టీ కార్యకర్తలకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి.
- పెనుకొండలో సవితమ్మ, పార్థసారథి, నిమ్మల కిష్టప్ప వర్గాలు తలోమార్గంలో వెళ్తున్నాయి. ఒకరి పేరెత్తితే మరొకరు భగ్గుమంటున్న పరిస్థితి. దీంతో కార్యక్రమం చేస్తే ఎటు వెళ్లాలో కూడా కార్యకర్తలు తేల్చుకోలేకపోతున్నారు.
- కళ్యాణదుర్గంలో ఉన్నం హనుమంతరాయ చౌదరి, మహేశ్వరనాయుడు వర్గాల మధ్య పాము ముంగిస వైరంలా మారింది. ఏకంగా వేర్వేరుగా పార్టీ కార్యాలయాలు నడుపుతుండటంతో టీడీపీ కేడర్ రెండుగా చీలింది.
- అనంతపురం అర్బన్‌లో ప్రభాకర్‌చౌదరికి వ్యతిరేకంగా చాలా మంది నాయకులు పావులు కదుపుతున్నారు. ప్రభాకర్‌చౌదరికి ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ రాకుండా చేయాలని యత్నిస్తున్నారు. అదే స్థాయిలో ఆయన కూడా రాజకీయం చేస్తున్నారు.
- మడకశిరలో గుండుమల తిప్పేస్వామి, ఈరన్న వర్గాలు కత్తులు దూసుకుంటున్నాయి. ఏ కార్యక్రమం చేసినా విడివిడిగా చేస్తూ ఒకరిపై మరొకరు పై చేయి సాధించాలని యత్నిస్తూ ఉన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు ఎన్నిసార్లు చెప్పినా మేమింతే అన్న రీతిలో వారు ముందుకెళ్తున్నారు.
- పుట్టపర్తిలో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డికి చెక్ పెట్టేలా సైకం శ్రీనివాసరెడ్డి, పెద్దరాసు సుబ్రహ్మణ్యం జోరుగా తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. పల్లెకు టికెట్ ఇస్తే అసలు తాము పనేచేయమంటూ మరికొందరు నాయకులు తిరుగుబాటు చేస్తుండటంతో పార్టీ కేడర్ సందిగ్ధంలో పడిపోయింది.
- కదిరిలో అత్తార్ చాంద్‌బాషా, కందికుంట ప్రసాద్ వర్గాలు ఎత్తుకుపై ఎత్తులు వేస్తున్నాయి. ఇప్పటికే అనేకసార్లు ఇరు వర్గాలు బాహాబహికి దిగిన విషయం తెలిసిందే. కార్యక్రమాలన్నీ విడివిడిగా చేస్తుండటం ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది.
- గుంతకల్లు టీడీపీ నాలుగు వర్గాలుగా విడిపోయింది. జితేంద్రగౌడ్, వెంకటశివుడు యాదవ్, పత్తి హిమబిందు, జీవానందరెడ్డి టికెట్ కోసం జోరుగా యత్నిస్తున్నారు. పార్టీ కేడర్ కూడా నాయకుల వారీగా విడిపోవడంతో అధిష్టానానికి ఏం చేయాలో కూడా దిక్కుతోచడం లేదు.
- ధర్మవరంలో పరిటాల శ్రీరామ్‌కు ప్రస్తుతం బీజేపీలో ఉన్న వరదాపురం సూరి చెక్ పెడతారని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. వారిద్దరి మధ్య తరచూ జరుగుతున్న మాటల యుద్ధం దీన్ని బలపరుస్తోంది.

వెంటాడుతున్న ఈడీ, సీబీఐ కేసులు

టీడీపీ హయాంలో చేసిన అవినీతి, అక్రమాలు ఆ పార్టీ నాయకులకు నిద్రపట్టనివ్వకుండా చేస్తున్నాయి. ఇప్పటికే తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఈడీ, సీబీఐ కేసులు మెడకు ఉచ్చులా తగులుకున్నాయి. బీఎస్–3 వాహనాలను బీఎస్– 4గా మార్చి అమ్మిన కేసులో ఇప్పటికే చార్జిషీట్లు దాఖలయ్యాయి. ధర్మవరంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన వరదాపురం సూరిపై భూఆక్రమణ కేసుల్లో సీఐడీ విచారణ జరుగుతోంది. దీనికితోడు తాజాగా కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్ రవాణా చేస్తూ దొరికిపోవడంతో కేసు నమోదు చేశారు. మరోవైపు అక్రమాస్తుల కేసులో పెనుకొండకు చెందిన సవితమ్మ ఇంట్లో ఇటీవలే సీబీఐ సోదాలు జరిగిన విషయం తెలిసిందే. అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అనుభవించి ఇప్పుడు కార్యకర్తలను పట్టించుకోవడం లేదనే అసంతృప్తి జ్వాలలు రోజూ ఎక్కడో చోట రగులుతూనే ఉన్నాయి.

పురం,దుర్గంలో స్థానిక గళం

హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గానికే రాకపోవడంతో తమ్ముళ్లు డీలా పడిపోయారు. ఆరు మాసాలకోసారైనా బాలకృష్ణ నియోజకవర్గానికి రావడం లేదని మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏళ్లుగా పార్టీలో ఉన్న కొందరు నేతలు ఈసారి స్థానికులకే టికెట్ ఇవ్వాలని తమ గళం వినిపిస్తున్నారు. స్థానికేతరులను టికెట్ ఇస్తే ఈసారి సహకరించమని ఇప్పటికే అధిష్టానానికి తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది.

- రాయదుర్గంలో మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులుపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆయన స్థానికుడు కాదు, ఇక్కడివారినే అభ్యర్థిగా పెట్టాలని పలువురు అధినాయకత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఓ వైపు పూల నాగరాజు, మరోవైపు దీపక్‌రెడ్డి కాల్వకు టికెట్ ఇవ్వకుండా యత్నిస్తున్నారు. అంతేకాదు, సొంత వాల్మీకి సామాజిక వర్గంలోనే కాల్వ శ్రీనివాసులుపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

టీడీపీ బీసీ సదస్సుకు సవితమ్మ డుమ్మా

పెనుకొండ: జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీకే పార్థసారథి గృహంలో గురువారం నిర్వహించిన టీడీపీ బీసీ సదస్సుకు ఆ పార్టీ నేత, కురుబ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సవితమ్మ గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప, అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, చినవెంకటరాముడు, రంగయ్య తదితర ముఖ్య నేతలు హాజరైనా సవితమ్మ రాకపోవడం ఆ పార్టీ శ్రేణుల్లో హాట్‌టాపిక్‌గా మారింది. టీడీపీ కమిటీల ఏర్పాటు, బీసీ సాధికారత కమిటీల నియామకంతో పాటు బీసీల సమస్యలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన కీలక సమావేశానికీ డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. కొంత కాలంగా బీకేకు, సవితమ్మకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఎవరికి వారు ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ వస్తున్నారు. ఎవరి వెంట నడవాలో తెలియక ఆ పార్టీ క్యాడర్ దిక్కులేనిదిగా మారిపోయింది. ఈ క్రమంలోనే అందరినీ ఏకం చేసేందుకు ఏర్పాటు చేసిన సమావేశం మరో సారి వారి మధ్య నడుస్తున్న కోల్డ్ వార్‌కు నిదర్శనంగా మారింది. పెనుకొండలో ఉండి కూడా సవితమ్మ హాజరుకాకపోవడంతో ఇక పార్టీ పటిష్టమైనట్లేనని టీడీపీ శ్రేణులు నిట్టూర్చడం కనిపించింది.

పెట్రోల్ బంక్ తనిఖీ



సవితమ్మ పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పెనుకొండ: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న సవితమ్మ పెట్రోల్ బంక్‌లో తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 'కొలతల్లో కోత, కల్తీ వాత' శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనంపై స్పందించిన అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. కొలతలు పరిశీలించి శాంపుల్స్ సేకరించారు. పరిశీలన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని వారు తెలిపారు.

ముస్లింల నడుమ చిచ్చుపెట్టొద్దు

- పరిటాల శ్రీరామ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- ముస్లిం మతపెద్దల ఆగ్రహం



మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు, మసీదుల కమిటీ నాయకులు

ధర్మవరం: టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ముస్లిం మతపెద్దలు సూచించారు. సామరస్యంగా ఉంటున్న తమ మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నించొద్దని హితవు పలికారు. పట్టణంలోని గాంధీనగర్‌వద్దనున్న కబ్రస్థాన్‌లో గురువారం జామియా మసీదు ముతవల్లి ముస్తక్ అహమ్మద్, మతపెద్దలు రహంతుల్లా, సయ్యద్‌మునాఫ్, జాకీర్ హుసేన్, ఖలీల్ తదితరులు మాట్లాడారు. సమాధుల వద్ద మురుగునీరు నిలిచి అపరిశుభ్రంగా ఉండడంతో చదును చేయాలని 40 మసీదుల కమిటీ సభ్యులతో చర్చించాకే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అయితే, ముస్లింల మధ్య చిచ్చుపెట్టేలా టీడీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. పరిటాల శ్రీరామ్ నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని సూచించారు. మసీదులు ఆక్రమించి ప్లాట్లు వేస్తారని ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ముస్లిం సోదరులు అపోహలు నమ్మవద్దని కోరారు. కబ్రస్థాన్‌లో మట్టితో చదును చేయించాక మళ్లీ అక్కడ ఖనన ఏర్పాట్లు చేస్తామని, అందుకే సమాధులను తొలగించి మట్టి వేసి ఎత్తు చేస్తున్నామని వారు వివరించారు. ముస్లింల అభ్యున్నతి కోసం ముతవల్లిలు నిరంతరం కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

కనులపండువగా గంధం వేడుక



బాబయ్య స్వామి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పెనుకొండ: పట్టణంలో బాబయ్య స్వామి రెండో గంధం వేడుక గురువారం తెల్లవారుజామున కనులపండువగా జరిగింది. సందల్ మహల్ నుంచి వందలాది భక్తుల నడుమ దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా గంధాన్ని తలపై తీసుకువచ్చి స్వామి సమాధి వద్ద సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి జనం తరలిరావడంతో పట్టణం జనసంద్రమైంది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

ఘనంగా ఉరుసు, దీపారాధన..

బాబయ్య దర్గా ఉత్సవాల్లో భాగంగా ఉరుసు, దీపారాధన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దర్గా ఆవరణలో స్వామి సమాధికి సమీపంలో ఉన్న హోమం వద్ద భక్తులు పెద్దయెత్తున కొబ్బరి కాయలు, కొబ్బరి చిప్పలు కాల్చి దీపాలు వెలిగించారు. చల్లగా చూడాలంటూ బాబయ్య స్వామిని ప్రార్థించారు. మత సామరస్యం కోసం పాటుపడుతున్న పలువురికి బాబయ్య స్వామి దర్గా ఆవరణలో తపురస్కారాలను అందజేశారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళా కూలీ మృతి



గుంతలో బోల్తా పడిన ట్రాక్టర్



హిందూపురం ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



మృతి చెందిన గీతమ్మ

- మరో 25 మందికి తీవ్ర గాయాలు
- కూలి పనులకు వెళ్తుండగా ప్రమాదం
- అమరాపురం మండలం కె.శివరంలో ఘోరం

అమరాపురం: కూలీలతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తాపడడంతో మహిళ మృతి చెందింది. మరో 25 మందికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని కె.శివరం సమీపంలో గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. కె.శివరం గ్రామానికి చెందిన 30 మంది మహిళలు కూలి పనుల కోసం ఎస్.రంగాపురం గ్రామానికి ట్రాక్టర్‌లో బయలుదేరారు. ఎస్.రంగాపురం పొలి మేరలో ట్రాక్టర్ డ్రైవర్ నాగరాజు సెల్‌ఫోన్ కిందపడగా.. దాన్ని తీసుకునేందుకు అతడు ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే ట్రాక్టర్ కిందపడిపోయాడు. ట్రాక్టర్ మాత్రం ఆగకుండా అలాగే వెళ్లి సమీపంలోని గుంతలో బోల్తా పడింది. హఠాత్పరిణామంతో ఉలిక్కిపడిన మహిళలు గట్టిగా కేకలు వేశారు. సమీప పొలాల్లో పనులు చేస్తున్న వారు వచ్చి ట్రాక్టర్ కింద ఇరుక్కున్న వారిని కష్టపడి బయటకు తీసి 108కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది క్షతగాత్రులను అమరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మడకశిర, హిందూపురం ఆసుపత్రులకు తరలించారు. ఘటనాస్థలంలోనే గీతమ్మ ప్రాణాలు విడవగా, స్వారక్కకు రెండు కాళ్లు తెగిపోయాయి. దీంతో ఆమెను అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. మరో మహిళ ముద్దీరమ్మకు ముక్కు, చెవులకు దెబ్బ తగిలింది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

అనాథలైన ముగ్గురు పిల్లలు..

మృతురాలు గీతమ్మ (34)కు భర్త తిప్పేస్వామి, ముగ్గురు పిల్లలు కార్తీక్, సోమశేఖర్, వీర భద్ర ఉన్నారు. తిప్పేస్వామి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో గీతమ్మ రోజూ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న ఆమె మరణించడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. ఆస్పత్రి వద్ద మృతురాలి పిల్లలు అమ్మకేమైందో తెలియక అమాయకంగా నిలిచి ఉండడం పలువురిని కన్నీళ్లు పెట్టించింది. తిప్పేస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎమ్మెల్యే తిప్పేస్వామి పరామర్శ..

ట్రాక్టర్ బోల్తా పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హుటాహుటిన మడకశిర, హిందూపురం బయలుదేరారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అర్ధాంతరంగా నిలిపేసి ఆసుపత్రులకు వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. ప్రతి ఒక్కరినీ పలకరించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వేగంగా స్పందించిన 108 సిబ్బంది, ఆస్పత్రుల వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి తదితరులున్నారు.

ధర్మవరం కుడికాలువకు నీటి విడుదల

కూడేరు: మండలంలోని పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడి కాలువకు గురువారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ ఏఈఈ లక్ష్మీదేవి తొలిరోజు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కలగళ్ల, మరుట్ల, పి.నాగిరెడ్డిపల్లి, జల్లిపల్లి, ఉదిరిపికొండ, రాప్తాడు నియోజకవర్గ రైతులు బోర్ల కింద సాగు చేసిన పంటలు నీటి కొరత కారణంగా దెబ్బతింటున్నట్లు కొన్ని రోజుల క్రితం ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో భూగర్భ జలాలు వృద్ధి చెందేలా 100 క్యూసెక్కుల లోపు నీటి సరఫరాకి చర్యలు తీసుకున్నట్లు ఆమె వివరించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

జిల్లా ఓటర్లు @ 13,43,312

పుట్టపర్తి టౌన్: జిల్లాలో మొత్తం 13,43,312 ఓటర్లు ఉన్నట్లుగా లెక్క తేలింది. తుది ఓటర్ల జాబితా– 2023ను కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ బసంత్‌కుమార్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మొత్తం ఓటర్లలో 6,73,955 మంది పురుషులు, 6,69,294 మంది మహిళలు, థర్డ్ జెండర్లు 63 మంది ఉన్నట్లు తెలిపారు. ఓటరు జాబితా రూపొందించిన అధికారులను అభినందించారు. 18 సంవత్సరాలు నిండిన యువత www.ceoandhra.nic.in ద్వారా ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, తహసీల్దార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
మడకశిర	1,05,099	1,02,334	-
హిందూపురం	1,17,957	1,15,407	18
పెనుకొండ	1,12,977	1,10,549	3
పుట్టపర్తి	1,00,042	1,00,856	13
ధర్మవరం	1,16,541	1,17,612	19
కదిరి	1,21,339	1,22,536	10
మొత్తం	6,73,955	6,69,294	63

క్లుప్తంగా

కారు అపహరణ

సోమందేపల్లి: స్థానిక మణికంఠ కాలనీ సమీపంలోని ఓ ధాబా వద్ద నిలిపిన ఇన్నోవా కారు (ఏపీ 39–టీహెచ్–6917)ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. తన కారును ధాబా ఎదుట యజమాని రామయ్య బుధవారం రాత్రి నిలిపి, ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం ధాబాకు చేరుకుని చూడగా కారు కనిపించలేదు. దీంతో కారును అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

‘నారాయణ’ నిర్వాహకులపై చర్యలకు డిమాండ్



ఎంఈఓ చెన్నకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

కదిరి అర్బన్: నిబంధలకు విరుద్ధంగా కదిరిలో పెట్రోల్ బంక్ పక్కన నడుపుతున్న పాఠశాల నడుపుతున్న నారాయణ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కదిరి మండల విద్యాధికారి చెన్నకృష్ణను నాయకులు కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. పాఠశాలకు ఆటస్థలం, తరగతి గదులకు వెంటిలేషన్ సౌకర్యం లేదన్నారు. అంతేకాక పెట్రోల్ బంక్‌కు ఆనుకుని పాఠశాల నిర్వహిస్తుడడంతో దాదాపు వెయ్యిమంది విద్యార్థుల భద్రతకు ముప్పు పొంచి ఉందన్నారు. అలాగే కదిరిలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించడం లేదన్నారు. తక్షణమే ఆయా పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఎంఈఓను కలసిన వారిలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వి.రాఘవేంద్ర, నాయకులు ఆసీఫ్, మనోజ్, శ్రీకాంత్, విష్ణు, నరసింహనాయుడు ఉన్నారు.

కల్లు దుకాణాల్లో తనిఖీలు



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హిందూపురం: కల్లు విక్రయాలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో చౌళూరు సమీపంలోని పలు కల్లు దుకాణాల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ గురువారం తనిఖీ చేశారు. కల్లులో రసాయన మత్తు పదార్థాలు కలయికపై మూడు సీసాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. అనుమతి లేకుండా కల్లు దుకాణం నిర్వహిస్తున్న శనివారప్పను అరెస్ట్ చేశారు.

ఇంటింటా పింఛన్ లబ్ధిదారులే

- మూడున్నరేళ్లలో 26,343 పింఛన్లు పెంపు
- ఆడిట్ అనంతరం 90 శాతం మందికి లబ్ధి
- పచ్చనేతల నోటికి తాళం



నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

జిల్లాలో పింఛన్ల లబ్ధిదారుల సంఖ్య

నియోజక వర్గం	2019లో లబ్ధిదారులు	2023లో లబ్ధిదారులు	పెరిగిన లబ్ధిదారులు
పుట్టపర్తి	36,395	42,233	5,838
కదిరి	37,608	43,295	5,687
ధర్మవరం	45,427	47,262	1,835
మడకశిర	36,246	39,292	3,046
హిందూపురం	31,927	35,503	3,576
పెనుకొండ	36,691	41,437	4,746
రాప్తాడు (3 మండలాలు)	16,549	18,164	1,615
మొత్తం	2,40,843	2,67,186	26,343

పుట్టపర్తి అర్బన్: జగనన్న సర్కార్ అందజేస్తున్న సామాజిక భద్రతా పింఛన్లతో అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు.. స్వశక్తితో తలెత్తుకుని జీవిస్తున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒక పింఛన్ అందుతోంది. తాను అధికారంలోకి రాగానే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తానంటూ 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా, పారదర్శకంగా సంక్షేమ ఫలాలను ఇంటింటికీ చేరవేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా... ఎక్కడేగాని సంక్షేమానికి లోటు రానివ్వకుండా లబ్ధిని మరింత పెంచుకుంటూ వెళుతున్న జగన్ సర్కార్‌పై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగింది.

గతానికి భిన్నంగా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ సొమ్ము అందుకునేందుకు లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడేవారు. పనులన్నీ వదులుకుని పస్తులతో గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, రచ్చబండలపై రోజుల తరబడి వేచి ఉండేవారు. నెలలో పది రోజుల మాత్రమే పింఛన్ పంపిణీ చేసి, అనివార్య పరిస్థితుల్లో హాజరుకాని వారికి మొండిచెయ్యి చూపేవారు. ఈ పరిస్థితుల నుంచి లబ్ధిదారులను గట్టెక్కిస్తూ జగన్ సర్కార్ వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. కేవలం పింఛన్లు మాత్రమే కాకుండా ప్రభుత్వ సేవలన్నీ వలంటీర్ ద్వారానే ఇంటి వద్దనే పొందే వెసులుబాటును కల్పించింది. నెలలో మొదటి రోజునే వేకువజామునే ఇంటి తలుపు తట్టి పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందిస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జిల్లాలో పెరిగిన పింఛన్ లబ్ధిదారులు..

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టే నాటికి జిల్లాలో 2,40,843 పింఛన్లు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన ఈ మూడున్నరేళ్లలో జిల్లా వ్యాప్తంగా 26,343 మంది లబ్ధిదారులు పెరిగారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 2,67,186కు చేరుకుంది. ఇందులో ఈ ఏడాది ఆరంభంలో 9,047 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి.

అందరికీ పింఛన్ పంపిణీ..

జిల్లాలో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 8,860 మందికి అధికారులు నోటీసులు జారీ చేసి, సరైన ధ్రువీకరణ పత్రాలు చూపిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేస్తున్నారు. ఈ లెక్కన ప్రతి ఇంటికీ ఏదో ఒక పింఛన్ అందుతోంది. ఈ విషయాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తెలుసుకున్న పచ్చనేతలు.. ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు చేయకుండా తమ నోటికి తాళం వేసుకున్నారు.

చాలా సంతోషంగా ఉంది



నా భర్త చనిపోయిన తర్వాత చిన్నపాటి అవసరాలకు సైతం డబ్బు కోసం చాలా ఇబ్బంది పడ్డాను. ఈ పరిస్థితుల్లో ఎలాంటి సిఫారసు లేకుండానే వలంటీర్ వచ్చి నా నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లి పింఛన్ లబ్ధి చేకూర్చారు. చాలా సంతోషంగా ఉంది. పింఛన్ కొత్తదే అయినా.. ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి వద్దకు వచ్చి అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాను. – సావిత్రమ్మ, గోకులం, పుట్టపర్తి

పెంచిన మొత్తంతో ఇచ్చారు



వలంటీర్ వచ్చి పింఛన్‌కు నేను అర్హురాలినని చెప్పి, నా ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లాడు. ఏ ఆఫీసు చుట్టూ నేను తిరగలేదు. ఏ ఒక్కరినీ కలిసి నాకు పింఛన్ మంజూరు చేయాలని అడగలేదు. ఈ నెల 1వ తేదీన పెంచిన రూ.250తో కలిపి రూ.2,750 పింఛన్ సొమ్మును వలంటీర్ వచ్చి అందజేశాడు. ఇచ్చిన మాట నెరవేర్చుకున్న రాజన్న బిడ్డ పది కాలాల పాటు చల్లగా ఉండాలని దేవుడిని కోరుకుంటున్నా. – మంజుల, వెంగళమ్మచెరువు

అర్హులందరికీ పింఛన్



ఆడిట్‌లో భాగంగా జిల్లాలో నోటీసులు జారీ చేసిన వారిలో సరైన ధ్రువీకరణ పత్రాలు చూపిన ప్రతి ఒక్కరికీ ఒకటవ తేదీనే పింఛన్ మొత్తాన్ని అందజేశాం. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే ధ్రువీకరణ పత్రాలు చూపితే పింఛన్ లబ్ధి చేకూరుస్తాం. ఎవరో చెప్పిన మాటలు నమ్మకండి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేస్తున్నాం. – నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

నాన్న రియల్లీ సారీ.. నిన్ను సంతోషపెట్టలేకపోయాను. టెన్త్, ఇంటర్‌లో... ఎప్పుడూ మీకు హ్యాపీ ఫీలింగ్ ఇవ్వలేకపోయా. డబ్బులు అన్నీ వేస్ట్ చేశా. అయినా కూడా నన్ను అంత బాగా చూసుకున్నారు. ఏం అడిగినా కాదనలేదు... సారీ అమ్మా నీ కష్టాన్ని వేస్ట్ చేస్తున్నందుకు.

అక్కా నువ్వు నాకోసం ఎంతో త్యాగం చేశావు. నేను మాత్రం నీకు ఏమీ ఇవ్వలేకపోయాను. నీ మ్యారేజ్‌కి చాలా మంచి బహుమతి ఇద్దామనుకున్నా..కానీ సారీ.. అమ్మా, నాన్నను బాగా చూసుకో

బై.. ఫ్రెండ్స్ ఇంక మిమ్మల్ని కలవను.

ఇలా తల్లిదండ్రులకు, సోదరికి, తన రూమ్మేట్స్‌కు టెక్స్ మెసేజ్ పంపిన ఓ ఇంజినీరింగ్ స్టూడెంట్ వర్సిటీ భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం అనంతపురం జేఎన్‌టీయూ క్యాంపస్‌లో చోటుచేసుకుంది.

అక్కా.. అమ్మానాన్నను బాగా చూసుకో



కళాశాల ప్రిన్సిపల్ సుజాతను ఆరా తీస్తున్న వన్‌టౌన్ పోలీసులు



చాణిక్యనంద రెడ్డి ఉంటున్న ఎల్లోరా హాస్టల్ భవనం (ఇన్‌సెట్) చాణిక్య (ఫైల్)

- జేఎన్‌టీయూ(ఏ) విద్యార్థి ఆత్మహత్య
- వర్సిటీ భవనంపైనుంచి దూకిన వైనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన రమణారెడ్డి, విజయ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె గీతారెడ్డి హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్ఐటీలో చదువుతోంది. కుమారుడు చాణిక్య నంద రెడ్డి (19) అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కేంపస్‌లో బీటెక్ (ఈసీఈ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రతిభ గల విద్యార్థిగా గుర్తింపుపొందిన చాణిక్య నందరెడ్డి అధ్యాపకులతో చాలా చనువుగా మసలేవాడు. తోటి విద్యార్థులతో కలిసి ఎల్లోరా హాస్టల్ భవనంలోని రూంలో ఉండేవాడు. రూమ్‌మేట్స్, అధ్యాపకులతో తప్ప మిగతా వారెవరితో కూడా పెద్దగా మాట్లాడేవాడుకాదు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి 12 గంటల దాకా స్నేహితులతో కబుర్లు చెప్పాడు. గురువారం తెల్లవారుజాము 5.40 సమయంలో తన గదిలోని మిత్రులకు బై అంటూ సెల్‌ఫోన్‌లో సందేశం పంపి క్షణాల వ్యవధిలోనే కంప్యూటర్ సెంటర్ మేడపైనుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నాడు. పెద్ద శబ్దం రావడంతో విద్యార్థులు వెళ్లి చూశారు. రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడిని చూసి ఆందోళన చెందారు. చాణిక్య గదిలో ఉంటున్న విద్యార్థులు దుస్తులు చూసి అతన్ని గుర్తించారు. వార్డెన్ ద్వారా విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ సుజాత వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించగా, పోలీసు మృతదేహాన్ని పరిశీలించారు. చాణిక్య భవనం పైనుంచి బోర్లా పడటంతో ముఖం పూర్తిగా ఛిద్రమైందని, చెవుల నుంచి తీవ్ర రక్తస్రావమై శరీరంలోని ఎముకలు సైతం విరిగిపోయాయని గుర్తించారు. హాస్టల్ గదిలో ఉంటున్న విద్యార్థులతో విచారించారు. సెల్‌ఫోన్‌లకు పంపిన సందేశాన్ని పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. 'నా చావుకు సీనియర్లు, జూనియర్లు ఎవరూ కారకులు కాదు'అని టైప్ చేసి పెట్టుకున్నట్లు సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

చాణిక్య నందరెడ్డి ఆత్మహత్య గురించి తెలుసుకున్న రమణారెడ్డి, విజయ దంపతులు వెంటనే అనంతపురం చేరుకున్నారు. విగతజీవిగా ఉన్న బిడ్డను చూసి గుండెలవిసేలా రోదించారు. ఉదయం తన ఫోన్‌కు సారీ నాన్న...అమ్మ అని సందేశం పంపాడని, నిద్రలేచి చూసుకునేలోపు ఇక్కడి విద్యార్థులు ఫోన్‌లు చేశారని చెప్పారంటూ విలపించారు. తన సోదరి హిమాచల్ ప్రదేశ్‌కు వెళ్తుండటంతో ఆమెను పలకరించేందుకు డిసెంబరు 24న ఉదయగిరికి వచ్చాడని, మూడు రోజులు తమతో సంతోషంగా గడిపాడని వారు తెలిపారు. రూ.60 వేలు స్కాలర్‌షిప్ వస్తే తన ఖాతాకే బదిలీ చేశాడని తండ్రి గుర్తు చేసుకున్నారు. తమకు అండగా ఉంటాడనుకున్న బిడ్డను భగవంతుడు ఇలా తీసుకుపోయాడంటూ వారు విలపించిన తీరు స్థానికులను కన్నీళ్లు పెట్టించింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఆర్జేడీ వెంకట కృష్ణా రెడ్డి

అనంతపురం: సీబీఎస్ఈ అమలయ్యే పాఠశాలల్లో ప్రతి విద్యార్థినీ ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆర్జేడీ ఎం. వెంకట కృష్ణా రెడ్డి అన్నారు. సీబీఎస్ఈ అమలుకు ఎంపికైన ప్రధానోపాధ్యాయులకు గురువారం రాప్తాడు మోడల్ స్కూల్‌లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జేడీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతపురం జిల్లాలో 51, శ్రీ సత్యసాయి జిల్లాలో 49 సీబీఎస్ఈ పాఠశాలలు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. సీబీఎస్ఈ విధానంలో ఉన్న పాఠశాలల్లో పాలన వేరుగా ఉంటుందని అందుకు తగ్గట్టుగా శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణ పెంపొందించడానికి మొత్తం ఆరుగుర రిసోర్స్ పర్సన్‌లను ఎస్‌సీఈఆర్టీ పంపిందన్నారు. సీబీఎస్ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం గర్వకారణమన్నారు. అడ్మిషన్లు ఎలా నిర్వహించాలి? బోధన, అభ్యసన తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ తిలక్ విద్యాసాగర్, డీసీఈబీ సెక్రెటరీ లోకేశ్వర రెడ్డి, ఏఎంఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలపై రాజకీయ బురద చల్లొద్దు

- మినరల్ డీలర్ లైసెన్స్ యజమానులు



మాట్లాడుతున్న ఎండీఎల్ యజమానులు

తాడిపత్రి: ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలపై రాజకీయ బురద చల్లడం సరికాదని రాయలచెరువు, యాడికి మండలాలకు చెందిన ఎండీఎల్ పరిశ్రమల యజమానులన్నారు. గురువారం రాత్రి తాడిపత్రిలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించకపోవడంతో ఆ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు 12 పౌడర్ మిల్లులు, క్రషర్ పరిశ్రమలకూ మూత వేయించారన్నారు. ఈ అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి గ్రామపెద్ద వి.రమణారెడ్డితో కలసి పరిశ్రమల యజమానులు తీసుకెళ్లి కొన్ని సడలింపులతో పరిశ్రమలు తెరుచుకునే అవకాశం కల్పించాలని విన్నవించారని గుర్తు చేశారు. ఆ దిశగా ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలను తప్పుబడుతూ టీడీపీ చెందిన కొందరు వారికి అనుకూలమైన పత్రికలో అసత్య కథనాలు ప్రచురించి, రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. ఎలాంటి తప్పు చేయని వారు సైతం వారి పరిశ్రమలను మూత వేసుకున్న పరిస్థితి ఉందన్నారు. ఎందరికో జీవనోపాధి కల్పిస్తున్న పరిశ్రమలను మూత వేయించడమంటే పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకున్నట్లవుతుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి రాజకీయాలకు తావివ్వకుండా పరిశ్రమల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా మీదుగా భారీగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని అనంతపురం సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను అనంతపురం సెబ్ సీఐ రవిచంద్ర గురువారం వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారం మేరకు మంగళవారం అనంతపురంలోని తపోవనం సర్కిల్‌లో సెబ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో టమాట తరలిస్తూ అటుగా వచ్చిన బొలెరో పికప్ వాహనాన్ని ఆపి పరిశీలించారు. అందులో 100 బాక్కుల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు లోతైన దర్యాప్తు చేపట్టి కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మారెళ్ల గ్రామానికి చెందిన మల్లికార్జున గౌడ్, బోయ రాజశేఖర్, రాంపల్లి నివాసి రమేష్‌ను గురువారం అరెస్ట్ చేశారు. నిందితులు కర్ణాటకలోని నాగలమడక నుంచి 9,216 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని మారెళ్ల గ్రామానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

డీజీపీతో జీఆర్పీ ఎస్పీ భేటీ



గుంతకల్లు: రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథరెడ్డిని గుంతకల్లు జిల్లా రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి గురువారం విజయవాడలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జీఆర్పీ స్టేషన్లలో ఖాళీగా ఉన్న వందలాది పోస్టుల భర్తీకి సహకరించాలని విన్నవించారు.

ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటాం

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర మరువలేమన్నారు. జిల్లా పరిషత్, అనుబంధ శాఖల్లో పనిచేస్తూ మృతి చెందిన ఆరుగురు ఉద్యోగుల కుటుంబసభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను గురువారం సంబంధీకులకు గిరిజమ్మ అందజేశారు. ఆఫీస్ సబార్డినేట్లుగా నియామక ఉత్తర్వులు అందుకున్న వారిలో తలుపుల ఎంపీడీఓ కార్యాలయానికి బాబా, నల్లమాడ హైస్కూల్‌కు మూడే తేజస్విని, కళ్యాణదుర్గం మండలపరిషత్‌కు గాజుల శ్రీకాంత్, జిల్లా పరిషత్ కార్యాలయానికి బెస్త ప్రవీణ్‌కుమార్, పరిగి మండల పరిషత్‌కు బి.తులసి, రాయదుర్గం మండల పరిషత్‌కు ఎస్.కవిత ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు, జెడ్పీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు లెక్కల శ్రీనివాసులు, రఫీ, ఎ–సెక్షన్ పరిపాలనాధికారి నాగేంద్రకుమార్, జూనియర్ అసిస్టెంట్ రఘురాం పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడామైదానం వేదికగా లాలీగా సహకారంతో ఆర్డీటీ, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 16 బాలికల ఫుట్‌బాల్ పోటీలు గురువారం ఉత్కంఠగా సాగాయి. పోటీల్లో గోవాకు చెందిన కంపాషన్, వైఎస్సార్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్, చెన్నైకు చెందిన తడం, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు గెలుపొందాయి.

ప్రారంభమైన క్రీడాపోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: పాలిటెక్నిక్ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, పీడీ గణేష్, లెక్చరర్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనధికార బైక్ రేస్ - ఇద్దరికి గాయాలు



గాయపడిన సల్మాన్



దావూద్

పెనుకొండ: అనధికారికంగా కొందరు యువకులు నిర్వహించిన బైక్ రైస్‌లో కర్ణాటక వాసులు ఇద్దరు గాయపడ్డారు. వివరాలు... పెనుకొండ బాబయ్య ఉరుసులో పాల్గొనేందుకు కొందరు ద్విచక్ర వాహనాలపై వచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కొందరు యువకులు సరదాగా బైక్ రేస్ నిర్వహించారు. 44వ జాతీయరహదారిపై పోటాపోటీగా ద్విచక్ర వాహనాలపై దూసుకెళుతుండగా పులేకమ్మ ఆలయం వద్ద ఓ వాహనం అదుపు తప్పి కిందపడింది. ఘటనలో కర్ణాటకలోని శిడ్లఘట్టకు చెందిన సల్మాన్, దావూద్ గాయపడ్డారు. వీరిని మిగిలిన యువకులు వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఏటా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ఈ అంశంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్థానికులు, ఉరుసుకు హాజరైన భక్తులు కోరారు.

వివాహిత ఆత్మహత్య



శ్రావణి (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఐదో రోడ్డులో నివాసముంటున్న శ్రావణి (26)ని అదే రోడ్డులో ఉంటున్న మేనమామ దుర్గాప్రసాద్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల వయసున్న కుమార్తె ఉంది. దంపతులిద్దరి మధ్య అప్పుడప్పుడు మనస్పర్థలు తలెత్తి గొడవపడేవారు. ఇద్దరికీ కుటుంబ పెద్దలు సర్దిచెప్పేవారు. అయితే దుర్గాప్రసాద్ తీరు సరిగా లేదంటూ పలుమార్లు తన తల్లిదండ్రులకు శ్రావణి చెబుతూ వచ్చింది. ఈ క్రమంలోనే గురువారం మధ్యాహ్నం ఇద్దరూ గొడవపడ్డారు. అనంతరం శ్రావణి గదిలోకి వెళ్లి ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చి గది తలుపు తీసి చూస్తే ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి వేలాడుతున్న శ్రావణి మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి అక్కమ్మ, సోదరుడు రాధాకృష్ణ అక్కడకు చేరుకుని శ్రావణి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న అనంతపురం మూడో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.